Geda
Ranga Rao
6-4-77

గెడా రంగారావు

గుండెలు ఆగిన శవాలు!!

కె. బి. ఎస్. కుమార్

అతనికి నలభైఐదేళ్లుంటాయ్...

చామన చాయ. పొడుగ్గా వున్నాడు. అక్కడక్కడ నెరిసిన తల. కళ్ళకి రిమ్‌లెస్ కళ్ళ జోడు. దిగులుతో ముడుచుకు పోయిన గంభీరమైన ముఖం. నలిగిన బట్టలు. ఎడం చేతికి వాచి. అకు చెప్పులు.

"జలంధర్ గారూ! ఫీజు ఎంతైనా ఇచ్చుకుంటాను. నా బిడ్డని చంపినవాళ్ళని ఉరికంబం ఎక్కించండి..." జేబులోంచి వంద రూపాయల కట్ట తీశాడు జగదీష్‌బాబు.

"ఆవేశ పడకండి. డబ్బు కాదు ప్రధానం. వాటిని జేబులోనే వుంచి అసలు విషయం చెప్పండి..." నెమ్మదిగా అన్నాడు డిటెక్టివ్ జలంధర్.

నీళ్ళు నిండిన కళ్ళని జేబు రుమాలుతో తుడుచుకుని చెప్పటం ప్రారంభించాడు జగదీష్‌బాబు.

"కాత్యాయని నాకు లేక లేక కలిగిన కూతురు. ప్రాణప్రదంగా పెంచుతూ వచ్చాను. అలాంటి తల్లి లేని నా కూతురు ఈనాడిలా దారుణ మరణానికి గురైతే ఎలా వుంటుంది జలంధర్ గారూ! మీరే చెప్పండి..." ఏడుస్తూ అన్నాడు జగదీష్‌బాబు.

"ఆ మాత్రం అర్థ చేసుకో లేని అవివేకిని కాను. జగదీష్ గారూ! ఆయుస్సు తీరి చస్తేనే ఎంతో బాధ పడతాం. మరి అలాంటి పరిస్థితిలో అందులోనూ ముందు జీవితాన్ని మూడు పువ్వులు, ఆరు కాయలుగా అనుభవించ వలసిన అమ్మాయి హత్య చెయ్యబడితే ఆ కన్నతండ్రి అనుభవించే బాధను ఊహించుకోగలను... చెప్పండి." వుద్వేగంగా అన్నాడు జలంధర్.

"నేను దాదాపు పదిన్నర - పదకొండు మధ్య ప్రాంతంలో వచ్చాను విజయవాడ నుండి. పోర్టికోలో అమ్మాయి కారాగి వుంది. అమ్మాయి ఎప్పుడు బయటినుండి వచ్చినా షెడ్డులో పెట్టి తాళం వేస్తుంది. అదే ఆశ్చర్యంతో కారు దిగి అమ్మాయి కారును సమీపించాను. తలుపు తెరిచి చూసి ప్రమాన్పడిపోయాను..." ఒక్క క్షణం ఆగి మళ్ళీ ప్రారంభించాడు జగదీష్‌బాబు.

"...అమ్మాయి మరణించి వుంది! ముఖం చాల భయంకరంగా వుంది!! కెవ్వున కేక వేశాను. నౌకర్లు అదిరి పడి లేచి తలుపులు తెరిచారు. పరిస్థితి తెల్సుకుని అందరూ నోళ్ళు వెళ్ళబెట్టారు. ఎవ్వరూ ఏమీ చెప్పలేక పోయారు. నాకాళ్ళూ చేతులు ఆడలేదు.

ఇలా పరిగెత్తు కొచ్చేశాను. ఈ విషయంలో మీరు నాకు సంపూర్ణ సహకారాన్నందించి ఆ దుర్మార్గుణ్ణి సాధ్యమైనంత త్వరలో పట్టుకోవాలి. అంతే డిటెక్టివ్ గారూ!" అన్నాడు జగదీష్‌బాబు.

"శవం ఎక్కడుంది?"

"కారులోనే వుంది."

"పదండి చూద్దాం. దారిలో మాట్లాడుకోవచ్చు."

"డిటెక్టివ్ గారూ! చిన్న రిక్వెస్ట్..."

"ఏమిటి?"

"అమ్మాయి ఇలా దారుణ హత్యకు గురైందని అందరికీ తెలీటం నాకిష్టం లేదు. దయచేసి ఈ విషయాన్ని గుప్తంగా వుంచండి. రహస్యంగా పరిశోధన ప్రారంభించండి... ప్లీజ్..."

"కనీసం పోలీసు బలగానికైనా తెలియజెయ్యావలసుంటుంది జగదీష్‌గారూ! మా యిద్దరి వల్లే అవుతుందని అనుకోవటం కొన్ని సమయాల్లో పొరపాటు. అత్యవసర పరిస్థితుల్లో వారి సహాయ సహకారాలని తప్పనిసరిగా పొందవలసి వస్తుంది. అలాంటప్పుడు మీరిలా..."

"తప్పనిసరైతే అత్యవసరమైన వాళ్ళకి మాత్రం తెలిస్తే ఫర్వాలేదు. కాని పత్రికల వరకు వెళ్ళటం నాకు చాల బాధగా వుంటుంది."

"అలాగే... మీరన్నట్టుగా ఈ విషయం అత్యవసరమైన వాళ్ళకి తప్ప అన్యులెవరికీ తెలిసే అవకాశం ఇవ్వను. సరేనా?"

"థాంక్స్..."

"పదండి."

6

ఇద్దరూ లేచారు. డిటెక్టివ్ అసిస్టెంట్ శ్రీనివాస్ వారిని అనుసరించాడు.

2

"మీ యింట్లో మొత్తం ఎందరున్నారు? ఎవరెవరు?" దారిలో జగదీష్‌బాబును ప్రశ్నించాడు, డిటెక్టివ్ జలంధర్.

"నేను, నలుగురు నౌకర్లు."

"మీరే వూరైనా వెడితే ఇల్లు వారి స్వాధీనంలోనే వుంటుందా?"

"అవును."

"మీ నౌకర్లందరూ నమ్మకస్థులని ధీమాగా చెప్ప గలరా?"

"ఆఁ... నలుగురూ దాదాపు ఏడెనిమిది సంవత్సరాలుగా మా యింట్లోనే పని చేస్తున్నారు. ఇంత వరకూ నాకు తెలీకుండా ఇంట్లోంచి అగ్గిపెట్టె కూడ బయటికి పోలేదు."

"ఇఫ్ యూ డోంట్ మైండ్, మీరు విజయవాడ వెళ్ళిన పనేమిటో చెప్పగలరా?"

"మా అమ్మాయికి సంబంధం చూట్టానికెళ్ళాను."

"ఫిక్స్ చేశారా?"

"ఇంకా చెయ్యలేదు. అమ్మాయి బ్రతుకుంటే త్వరలోనే అయ్యేదేమో! అమ్మాయి ఫోటో తీసికెళ్ళాను. నే వెళ్ళేసరికి అబ్బాయి వూళ్ళో లేడు. ఫోటో తీసుకున్నారు. వచ్చాక మాట్లాడి ట్రంకాల్ చేస్తామన్నారు."

"బైదిబై - మీరీ సంబంధం చూస్తున్నట్టు మీ అమ్మాయికి తెల్సా?"

"ఊఁహూఁ..."

"మీ అమ్మాయికి, ఆ అబ్బాయికి పరిచయం వుందా?"

"లేదు. అసలు అమ్మాయి అతని ముఖమైనా చూళ్లేదు."

"మీ అమ్మాయి కెవరైనా బోయ్ ఫ్రెండ్స్ ఉన్నారా?"

"చదువుకున్న పిల్ల. అందరితోనూ చనువుగానే వుండేది." మధ్య మధ్యన కళ్ళు తుడుచుకుంటూ ముక్కు చీదుతున్నాడు జగదీష్‌బాబు.

"మీ అమ్మాయి ఎవరైనా ప్రేమిస్తున్నట్టుగాని ఎవరితో నైనా తిరుగుతూన్నట్టుగాని మీకు తెల్సా?"

"లేదు..." ఆ ప్రశ్న జగదీష్‌బాబుకి బాధను కల్గించింది. అయినా తప్పదు.

"థాంక్స్... ప్రస్తుతానికివి చాలు. శవాన్ని చూశాక అవసరమైతే మరికొన్ని ప్రశ్నలు వేస్తాను." జేబులోంచి రెడ్ విల్స్ పాకెట్ తీశాడు డిటెక్టివ్ జలంధర్.

3

ఆమె... కాత్యాయని శవం కాడిలాక్‌లో డ్రైవింగ్ సీట్లోనే వుంది. వెనుక సీట్ వైపు చూస్తుండగా ప్రాణం పోయింది. కళ్ళు తెరవబడే వున్నాయ్!

శవాన్ని తదేకంగా చూశారు డిటెక్టివ్ ద్వయం.

కారు వద్దే కూర్చుని వున్నారు నౌకర్లు దిగులు పడ్డ ముఖాలతో.

"మీరంతా లోనికి వెళ్ళండి" నౌకర్లని ఆదేశించాడు జగదీష్‌బాబు. మౌనంగా వెళ్ళిపోయారు.

"మీ అమ్మాయి నెవరూ హత్య చేయలేదు జగదీష్ గారూ!" డిటెక్టివ్ జలంధర్ అన్నాడు.

"మరి... ఆత్మహత్య చేసుకొనుంటుందంటారా?"

వెంటనే అన్నాడు జగదీష్‌బాబు.

మౌనంగా వుండిపోయాడు జలంధర్.

"అంత అవసరం దానికేముంది?"

"జగదీష్‌గారూ! అలా చూడండి బాక్‌సీట్‌ కేసి చూస్తూండగా అమ్మాయి ప్రాణం పోయింది..."

"...అవును బాస్! వెనక్కి చూస్తోందంటే వెనక సీట్లో ఏదైనా వుండి వుండాలి. లేదా ఎవరైనా వుండి వుండాలి."

"కరెక్ట్... ముఖంలో ఆశ్చర్యం, భయం స్పష్టంగా కన్పిస్తోన్నాయి. దీన్ని బట్టి ఆశ్చర్యకరమైన భయంకరమైన సన్నివేశం ఆమెకక్కడ కనుపించి వుండాలి. ఆ షాక్ వల్ల ఆమె గుండె ఆగిపోయి వుంటుందని తేలిగ్గా వూహించవచ్చు కదూ!" శ్రీనివాస్ వైపు చూశాడు డిటెక్టివ్.

"ఏ మాత్రం సందేహం లేదు."

"అలాంటి సంఘటన ఎదురవటానికి ఆస్కారం వుందంటారా? శ్రీనివాస్‌గారూ!" అడిగాడు జగదీష్‌బాబు.

"ఎందుకుండదు? ఆలోచిస్తే తేలవచ్చు."

"జగదీష్‌గారూ! ఫొటోగ్రాఫర్ని ఇన్‌స్పెక్టర్ని పిలవాలి. ఫోనుందా?" జగదీష్ వైపు చూశాడు జలంధర్.

"జలంధర్‌గారూ! నే చెప్పిన విషయం..."

"గుర్తుంది లెండి. వారితో కూడ చెబుతాను."

"పదండి..." లోనికి దారి తీశాడు జగదీష్‌బాబు.

డయల్ చేశాడు జలంధర్. ఇన్స్‌పెక్టర్ చక్రవర్తి పలికాడు.

"హలో ఇన్స్‌పెక్టర్! నేను జలంధర్‌ని మాట్లాడు

తున్నాను. ఫింగర్ ప్రింట్ ఎక్స్‌పర్ట్‌ని, ఫొటోగ్రాఫర్ని తీసుకొని వెంటనే రావాలి..." అడ్రసు చెప్పాడు.

"వాట్ హేప్పెండ్?" అవతల్నుంచి ఆదుర్దాగా అన్నాడు చక్రవర్తి.

"వచ్చాక చెబుతాను. పదినిముషాల్లోగా మీరిక్కడుండాలి." సమాధానాని కెదురు చూడకుండా ఫోన్ పెట్టేసి శ్రీనివాస్ వైపు తిరిగాడు జలంధర్.

"వాసూ! వాళ్ళొస్తే రిసీవ్ చేసుకో. ఈలోగా నేను నౌకర్లతో మాట్లాడ్తాను."

"ఓకే బాస్..." వెళ్ళాడు శ్రీనివాస్.

"జగదీష్‌గారూ! ప్రత్యేకంగా వున్న ఓరూమ్ చూపించండి."

"అదుగో నా ఆఫీస్ రూమ్..." ఓ ప్రక్కగా చూపించాడు జగదీష్‌బాబు.

"మీ నౌకర్లల్లో ఒక్కొక్కర్ని విడిగా పంపండి లోనికి. చివరగా మీరు రండి..." జగదీష్ చూపించిన గదివైపు నడిచాడు జలంధర్.

మొదటగా ఓ నౌకరొచ్చాడు గదిలోకి.

"నీ పేరు?"

"గోపయ్య బాబయ్యా!"

"ఎన్నాళ్ళ నుండి పనిచేస్తున్నా విక్కడ?"

"ఎనిమిదో ఏడు బాబూ!"

"ఈ ఎనిమిదేళ్ళలో మీ అయ్యగార్ని గూర్చి నీకు బాగా తెలిసుండాలి."

"ఎన్నలాంటోరు బాబయ్యా! ఎవురికీ అపకారమంటూ చేసెరగరు. ఆరేమో ఆరి యాపారమేంటో. అంతే. ఓరి

జోలికంటూ పోరు..."

"ఆయనకి ఒక్కతే కూతురు కదూ! ఇప్పుడు చని పోయిన అమ్మాయి..."

"అవునండీ..."

"ఆ అమ్మాయి స్వభావం?"

"తండ్రికి పూర్తిగా యతిరేకం బాబయ్యా! అంటే పూర్తిగా కాదు. ఆరి మనసూ మంచిదే! కాని చిలిపి చేట్ట లెక్కువ. తన మాటే నెగ్గించుకునే సాభావం..."

"కోపంకూడ ఎక్కువేనా?"

"ఎక్కువేకాని బాబయ్యా! అది నీటిమీద బుగ్గలాంటి దైతే, ఇట్టా వస్తుంది మళ్లా అంతలోనే పోతుంది."

"మీ అయ్యగారు, అమ్మగారు అప్పుడప్పుడూ తగవు లాడుకునే వారా?"

"చిన్న చిన్న యిసయాల్లో కూడ అప్పుడప్పుడు చిలి పిగా తగువులాడుకునే వారండి. అయితే అవన్నీ అప్పటి కప్పుడే! మళ్ళీ అమ్మాయిగారు లేందే అయ్యగారికి ముద్ద మింగుడు పడదు. అయ్యగారు లేందే అమ్మాయిగారికి బుక్క తిన్నట్టుండదు."

"అమ్మాయిగారు మరణించక ముందు - అంటే ఆరోజు ఉదయంకాని సాయంత్రంకాని ఇద్దరికీ తగవు జరిగిందా?"

"లేదండి... అసలయ్యగారూళ్ళో లేందే!"

"ఈ రోజు రాత్రి నువ్వెప్పుడు పడుకున్నావ్?"

"తొమ్మిదిన్నరకు."

"వెంటనే నిద్రపోయావా?"

"లేదు బాబయ్యా! పడుకున్నాక పదినిమిసాలకి నిద్ర పట్టింది."

"మీ అయ్యగారి కోసం ఎవరేనా వస్తుండే వారా?"

"ఎంతో మంది వస్తూండే వారు బాబయ్యా!"

"అమ్మాయిగారి కోసం?"

"ఆరి కోసమూ వస్తుండే వారు."

"అంతా ఆడపిల్లలేనా?"

"అవును."

"ఆఁ... ఇందాక మీ అయ్యగారు, అమ్మాయిగారు తమాషాగా కీచులాడుకునే వారన్నావ్ గా! ఓ చిన్న ఉదాహరణ చెప్పగలవా?"

"ఆఁ... మూడు రోజుల కిందట అయ్యగారి కారు ట్రబులిచ్చింది. ఏదో తొందర పనున్నందున అమ్మాయిగారి కారు తీసికెళ్లారు. వచ్చిం తర్వాత కోప్పడింది. ట్రబులిస్తే టాక్సీలో ఎక్కాలిగాని నా కారు తీసికెడితే నాకేదైనా అవసరమొస్తే నేనెలా ఎల్లాలి? అని..."

"అమ్మాయిగారు అప్పుడప్పుడూ అనుకోకుండా బయటికి కెడుతూంటూరా?"

"ఎప్పుడో ఓ సారి..."

"ఈ రోజు పొదయం వెళ్లారా?"

"ఎల్లారండి..."

"ఊరికేనా? ఏదైనా పనిపైనా?"

"తెలీదండీ..."

"ఎన్ని గంటలకి?"

"పది గంటల కెల్లారండి... మళ్ళీ ఓ గంటకల్లా వొచ్చేశారు. తిరిగి సాయంత్రం ఐదు గంటల కెళ్ళారు."

"ఎక్కడికైనా వెడితే చెప్పి వెళ్ళరా?"

"నాతో సెప్పలేదండీ... గోవిందమ్మతో సెప్పా రేమో!"

"ఆవిడెవరు?"

"ఈ యింట్లో వంట మనిసి..."

"సరే. నువ్వెళ్ళి గోవిందమ్మని పంపించు."

"దండాలండి..." వెళ్ళిపోయాడు గోపయ్య.

కుర్చీకి ఆనుకొని సిగరెట్ తీశాడు జలంధర్. వెలిగించుకునేలోగా దాదాపు ముప్పై సంవత్సరాల ఆడమనిషి లోనికి ప్రవేశించింది కాస్త బెరుగ్గా.

"నీ పేరు గోవిందమ్మ కదూ!" గట్టిగా దమ్ము పీల్చి ప్రశ్నించాడు జలంధర్.

"అ... అవును బా...బూ!" తడబడిందామె.

"ఎన్నేళ్ళ క్రితం చేరావిక్కడ?"

"దాదాపు ఆరు సంవత్సరాలైంది."

"నీ డ్యూటీ ఏమిటి?"

"ఇల్లు వూడ్చడం, అంట్లు తోమటం, వంటచెయ్యటం, అమ్మాయిగారికి కావలసిన సదుపాయాలు చూట్టం."

"ఈ రోజు ఉదయం కాత్యాయని ఎక్కడికెళ్ళింది?"

"ఎక్కడికో వెళ్ళింది. చెప్పలేదు." ఆమె ముఖంలో గాభరా కన్పించింది.

"అబద్ధం చెప్పటానికి ప్రయత్నించకు. ఆమె తన స్నేహితుణ్ణి కలుసుకోటానికి వెళ్ళింది. అవునా?" రెట్టించాడు జలంధర్.

"అ...అవును." చెప్పక తప్పలేదు గోవిందమ్మకి.

"చెప్పూ... అతనెవరు?" అనాలోచితంగా కలిగిన అయిడియాకి మనసులోనే నవ్వుకుంటూ అడిగాడు జలంధర్.

"అతను... అతని పేరు."

"నిర్భయంగా చెప్పు..."

"అశోక్ కుమార్... దయచేసి అయ్యగారికి ఈవిషయం తెలియనివ్వకండి. మీకు పుణ్యముంటుంది. తెలిస్తే నా ప్రాణం తీస్తారయ్యగారు. అతనెవరో నాకూ తెలీదు, దేవుడి మీదొట్టు." అమాయకంగా నెత్తిమీద చెయ్యి పెట్టుకుంది గోవిందమ్మ. ఆమె కళ్ళలో నీళ్లు తిరిగాయ్.

"నువ్వెప్పుడైనా చూశావా అతన్ని?"

"ఒక్కసారి చూశాను."

"ఎప్పుడు? ఎక్కడ?"

"నెల క్రితం అమ్మాయి పుట్టిన రోజు పండగ జరిగింది. ఆ రోజు ఎంతో సంతోషంగా గడిచిపోయింది. ఆ రాత్రే అత్యవసరమైన పనిమీద తెనాలి వెళ్ళిపోయారయ్యగారు. మూడు రోజులదాకా రానని చెప్పారు. ఆ మరురోజు ఆ అబ్బాయిని తీసుకొచ్చింది కాత్యాయనమ్మ. నాతోనే వంట చేయించి అతనికి పెట్టింది."

"వారిద్దరూ ప్రేమించుకున్నారా?"

"అవును."

"శారీరకంగా వారిద్దరికీ సంబంధం వుందా?"

"వుంది. ఆ రోజు మధ్యాహ్నం భోంచేశాక ఓ అర గంటయ్యాక ఇద్దరూ కాత్యాయనమ్మ గదిలోకెళ్ళి తలుపు లేసుకున్నారు. గంటన్నర వరకూ బయటికి రాలేదు."

"అతని గురించి నీకేమైనా తెల్సా?"

"అంతకు మించి నాకేం తెలియదు. అయినా ఒక్క సారి చూసినంత మాత్రాన్నే ఏం తెలుస్తుంది?"

"వాళ్ళిద్దరి విషయం నీకు తెలుసునని కాత్యాయనికి తెల్సా?"

"తెలుసు. ఆమే చెప్పింది. ఎవరితోనూ చెప్పొద్దంది."

"ఎవరితోనైనా చెప్పావా?"

"ఇప్పుడు మీతో చెప్పాగా?"

"రైట్... అశోక్కుమార్ వచ్చిన రోజు మిగతా ముగ్గురు నౌకర్లూ ఇక్కడే వున్నారా?"

"లేరు. ఏదో పని కల్పించి ముగ్గుర్నీ బయటికి పంపించేసింది కాత్యాయనమ్మ."

"అమ్మాయెప్పుడైనా తనలో తను బాధ పడ్డంకాని, కుమిలిపోవటం కాని చూశావా?"

"లేదు."

"అశోక్కుమార్ ఫోటో ఏదైనా వుందా?"

"లేదు... ఆఁ... వుంది... ఇద్దరూ కలిసి తీయించుకున్న ఫోటో ఒకటి వుంది."

"తీసుకు రా... వద్దులే... అదక్కడే వుండనివ్వు. నేనిక్కడి నుండి బయటకు వెళ్ళేటప్పుడు డైరీ ఇక్కడుంచి వెడతాను. సమయం చూసుకుని గుట్టుగా తెచ్చి పెట్టెయ్ అందులో. ఇక నువ్వెళ్ళొచ్చు."

తలూపి నమస్కారం చేసి వెళ్ళిపోయింది గోవిందమ్మ నుదుటికి పట్టిన చెమటని తుడుచుకుంటూ.

హుషారుగా మరో సిగరెట్ వెలిగించుకున్నాడు జలంధర్. ఇంతలో మూడో వాడొచ్చాడు.

"నా పేరు ఖాన్ అయ్‌గోరూ!" అన్నాడు.

"పూర్తి పేరు?" గుండెల నిండా పొగ పీల్చి ప్రశ్నించాడు జలంధర్.

"ఖాదర్ ఖాన్."

"ఎన్నాళ్ళైంది నువ్వు పన్లో చేరి?"

"గోపయ్యా, నేను ఒకేసారి చేరాం."

"ఒకే రోజా?"

"అవును."

"మీరు రాక ముందు ఎవరెవరున్నారు నౌకర్లు?"

"డ్రైవరు దేవిడు, వంట మనిషి మాణిక్యమ్మ."

"ఆమేమైంది?"

"ఆమె వంటచేసి వచ్చే జీతంతో కొడుకును చదివిస్తూండేది. అతని చదువు అయిపోయిన తర్వాత వెంటనే వచ్చి తీసికెళ్ళాడు."

"నిన్ను, గోపయ్యాని ఒకేసారి పన్లోకి తీసుకోవలసిన అవసరం మీ అయ్యగారికి రావడానికి కారణం?"

"అనుకోకుండా జరిగింది. అప్పుడు అయ్ గారి యాపారం ఇలా సాగడంలేదు. అదీగాక అమ్మాయిగోరు అప్పుడు ఎనిమిది, తొమ్మిదేళ్ళ వయసులో వున్నారు. అయ్ గోర్ని బాగా ఏడిపిస్తూండేవోరు. అయ్ గోరు పూర్తిగాని, బయటిగ్గాని ఎడితే అమ్మాయిని సముదాయించేవో రెవరు?"

"మాణిక్యమ్మ వుండేదన్నావ్ గా!?"

"ఉండేది. కాని ఆమెకు యింటిపన్లో, వంటపన్లో మధ్యాన్నం వరకు, సాయంకాలం ఆరునుండి తొమ్మిది వరకూ సరిపోతూండేది. ఆ సమయంలో, ఈ సమయంలో పాపని చూడ్డాని కెవరూ లేకపోయారు. అందుకే గోపయ్యను పాపకోసమే పన్లోకి తీసుకున్నా రయ్ గోరు."

"అయితే యిద్దరిలో నువ్వే ముందొచ్చావన్నమాట."

"లేదు. తర్వాత నే వచ్చాను."

"నువ్వెలా చేరావ్?"

"అప్పుడు నాకు పదిహేడేండ్లు. ఓ మంగుల షాపులో

పని చేస్తూండేవాణ్ణి. ఓరోజు మా బంధువుల యింట్లో పెండ్లి జరిగింది. నాకు సెలవు దొరక్క పోవడంతో మా నాన్న, అమ్మ చెల్లాయి వెళ్ళారు. తిరిగొచ్చేటప్పుడు రైలు ప్రమాదంలో చచ్చిపోయారు. ఆ బాధతో వారంరోజులు పనికి పోలేదు నేను. మా యజమానికి కోపంవచ్చి నన్ను పన్లోండి తీసేశారు.

మూడురోజులు తిండిలేకుండా ఆకలికి ఆపుకోలేక పోయాను. నడుస్తూండగా ఓ హోటల్ ముందు అయ్యగోరు ఎవరితోనో మాట్లాడుతూ కన్పించారు. తెలీకుండా ఆయన జేబులోంచి పర్సు తీశాను. అక్కడే వున్న డేవిడ్ నన్ను పట్టుకున్నాడు. జనం పోగయ్యారు. నాలుగైదు దెబ్బలు పడ్డాయ్ నామీద.

అయ్యగోరు అందర్నీ వారించి నా వివరాలు కనుక్కున్నారు. జాలిపడి హోటల్లో కడుపునిండా తిండి పెట్టించారు. నా కథ విని జాలితో ఆరితోపాటే నన్నూ తీసుకొచ్చి తనదగ్గర నౌకరుగా పెట్టుకున్నారు. నేనొచ్చానని గోపయ్యను తీసెయ్యలేదు. నేను తోటపని, పై చిల్లర పనులు చేస్తుండేవాణ్ణి'' అంతటితో ఆగాడు ఖాన్.

''ఐ. సీ. నెలరోజుల క్రితం కాత్యాయని పుట్టినరోజు పండగ జరిగిందా?''

''అవును, జరిగింది.''

''ఆ మరుసటిరోజు మధ్యాహ్నం నువ్వింట్లో నే వున్నావా?''

''లేనయ్యగోరూ!''

''ఎక్కడి కెళ్ళావ్?''

''పక్క వూళ్ళో తన స్నేహితురాలుందని ఆమెతో

ఉత్తరం ఇచ్చిరమ్మని చెప్పి పంపింది ముగ్గుర్నీ."
"ఇచ్చేశారా?"
"ఉఁహూఁ. ఆమె అడ్రస్ కోసం తిరిగి తిరిగి వచ్చాం. సంవత్సరం క్రిందటే ఆ వూరు వదిలి పోయిందని తెల్సింది."
"ఆల్ రైట్. నువ్వెళ్ళొచ్చు."

సలామ్ చేసి వెళ్ళిపోయాడు ఖాదర్ ఖాన్.

డేవిడ్ ప్రవేశించాడు.

4

"హలో! కమాన్. మీ కోసమే యెదురుచూస్తు న్నాను."
"వాట్ శ్రీనివాస్! వాట్ హ్యాపెండ్! విషయం చెప్పకుండా ఫొటోగ్రాఫర్ని, ఫింగర్ ప్రింట్ ఎక్స్పర్ట్ని పిల్చుకురమ్మని ఫోన్ చేశాడు మీ బాస్. కొంపదీసి హత్య కాదు కదా!"
"హత్య కాకపోతే మీతో ఏం పని?" నవ్వుతూ కాడిలాక్ వైపు నడిచాడు శ్రీనివాస్. అనుసరించారు ముగ్గురూ.
డోర్ తెరిచి సన్నివేశాన్ని చూపించాడు శ్రీనివాస్.
వ్రేలిముద్రలేమైనా కనపడతాయేమోనని అనుమాన మున్నచోటల్లా పౌడర్ చల్లాడు ఫింగర్ ప్రింట్ ఎక్స్పర్ట్.

ఆశ్చర్యం! ఒక్క వ్రేలిముద్రయినా బయటపడలేదు!
నిరాశగా నిట్టూర్చాడు శ్రీనివాస్.

శవం నాలుగైదు ఆంగిల్స్లో ఫొటోలు తియ్యబడింది.
"ఎలా జరిగింది?" ప్రశ్నించాడు చక్రవర్తి.
"ఆమెనెవరూ హత్య చెయ్యలేదిన్స్పెక్టర్! బాక్ సీటు కేసి చూస్తుండగా ప్రాణంపోయింది. అంటే అక్కడ

ఆమె హార్టు ఫెయిలవటానికి తగినంత భయంకరమైన సన్నివేశాన్ని ఆమె చూసుండాలి. అదే ఏమయ్యుంటుందాని ఆలోచించలేక ఛస్తున్నా!"

"హత్య జరిగిన ప్రదేశం?"

"అదీ తేలలే దింకా."

"ఇక్కడే ఎందుక్కాకూడదు?"

"మరోచోటెందుక్కాకూడదు?"

"మరోచోట హత్య జరిగితే ఇక్కడికెలా వస్తుంది?"

"ఎవరేనా తీసుకొని రావచ్చు...కరెక్ట్. మన మూహించింది నిజమే అయితే అలాగే జరిగుంటుంది. శవాన్ని చూడు. డ్రెస్ చూస్తే ఎక్కడో బయటినుండి వస్తున్నట్టుంది."

"బయల్దేరుతూ వుండి వుండొచ్చుగా?"

తల అడ్డంగా తిప్పాడు శ్రీనివాస్. "ఉఁహూఁ... బయలుదేరేట్టయితే నౌకర్లు మేలుకొనుండేవారు. వెంటనే తెలిసిపోయుండేది. కాబట్టి వచ్చేప్పుడే జరిగుండాలి."

"చనిపోయాక ఎవరు వదిలిపెట్టుంటారు?"

"బాక్ సీట్లో వున్నవారు."

"కాబట్టి వెనకసీట్లో వున్నది మనిషేనని తేలిపోయింది."

"ఇక్కడ కొంచెం ఆలోచించవలసుంది. మనిషిని. చూసినంత మాత్రాన్నే ప్రాణం పోవటానికి ఆస్కారం వుంటుందంటావా?"

"లేకపోతే దెయ్యమంటావా?"

"ఎందుక్కాకూడదు? ఆ ముఖంలో వున్న భయాందోళనలు చూస్తోంటే అలాగే నన్పిస్తోంది."

"దెయ్యం డ్రైవ్ చెయ్యగలదా?"

"ఈ కాలం దెయ్యాలు అన్నీ చెయ్యగలుగుతున్నాయి."

"అలా నువ్వే అంటావ్; ఇలా నువ్వే అంటావ్. ఇంతకీ బాక్ సీట్లో వున్నది మనిషా? దెయ్యమా?"

"అదే కనుక్కోవాలి. కమాన్. బాస్‌తో మాట్లాడదాం. ఈ కేసుపై యిప్పుడే ఇంట్రెస్టు పెరుగుతోంది. ఈ లోగా బాస్‌కి కొన్ని విషయాలు తెలిసుంటాయ్" లోపలకి నడిచాడు శ్రీనివాస్. అనుసరించాడు చక్రవర్తి.

5

"నలుగుర్ని ప్రశ్నించాను. కాని కేసుకి పనికొచ్చే సమాచారం ఒక్కటీ అందలేదు."

"వాళ్ళకేం తెల్సు జలంధర్ గారూ!?"

"మీ కెవరేనా శత్రువులున్నారా?"

"లేరు. అయినా నాకు శత్రువులుంటే నామీద పగ తీర్చుకోవాలి కాని, అర్థం శుభం తెలియని నా కూతురుపై ఎందుకు సాధిస్తారు?".

"మీకు గ్లాస్ ఫాక్టరీ వుంది కదూ!"

"అవును."

"పార్ట్‌నర్స్ వున్నారా? మీరొక్కరేనా?"

"మొత్తం ఇద్దరమే."

"మరొక రెవరు?"

"నరహరిరావు."

"వారెక్కడున్నారు?"

"ప్రస్తుతం మద్రాసులో."

"ఏం చేస్తున్నారు?"

"ఉన్న ఆస్తినంతా బిల్డింగుల రూపంలో మార్చే శారు. ఇప్పుడాయనకి పదంతస్తుల భవనాలు ఆరున్నాయి. కొన్ని ఆఫీసులకి, కొన్ని హోటళ్ళకి ఇచ్చేసి బాడుగలతో హాయిగా వున్నారు."

"ఆయన అప్పుడప్పుడూ ఇక్కడ కొస్తుంటూరా?"

"రారు. ఆయనకి నాపై నమ్మకముంది. సంవత్సరానికి వచ్చే ఆదాయంలో వన్ థర్డ్ మాత్రం తనకి పంపమన్నారు. అంతే...ఎప్పుడేనా వస్తే నన్ను చూసి వెళ్ళిపోతారు. ఫాక్టరీ వంక కన్నెత్తికూడ చూడరు."

"ఐసీ. మీ నౌకర్లు మీ యింట్లోనే పడుకుంటూరు కదూ ప్రతిరోజూ!"

"అవును."

"మీ అమ్మాయి ఎంతవరకు చదువుకుంది?"

"పి. యు. సి. పాసైంది."

"చదివేరోజుల్లో ఆమెకి బోయ్‌ఫ్రెండ్స్ వుండే వారా?"

"నాకు తెలిసినంతలో ఎవరూ లేరు."

"ఈ మధ్య మిమ్మల్ని బెదిరిస్తూ ఏవైనా వుత్తరాలు కాని, టెలిఫోన్ కాల్స్ గాని వచ్చాయా?"

"రాలేదు."

"థ్యాంక్యూ వెరీమచ్. పదండి. ఇన్స్పెక్టర్ వాళ్లొచ్చి వుంటూరు. సమాచారం ఏదైనా తేలవచ్చు." జగదీష్ బాబు చూడకుండా తన డైరీని జారవిడిచాడు జలంధర్.

జగదీష్‌బాబు కూడ లేచాడు.

జలంధర్‌ని చూడగానే విష్ చేసాడు చక్రవర్తి.

"ఎంతసేపైంది మీరొచ్చి?"

"జస్ట్ ఫైవ్ మినిట్స్ బ్యాక్..."

"శవాన్ని చూపావుగా!" శ్రీనివాస్ వైపు చూశాడు.

"చూపాను. ఆలోచించగా కాత్యాయని హత్యకి కారణం ఇదమిద్ధంగా చెప్పలేను గాని మొత్తానికి ఏదో దెయ్యమే ఆమె ప్రాణం పోవటానికి కారణం అయ్యుండాలి."

"అంటే...?"

"కాత్యాయని మామూలుగా డ్రయివ్ చేస్తూంటుంది. వెనుక నుండి ఆమెను బెదిరించి వుండాలి. ఈ విషయాన్ని బట్టి వెనుక బెదిరించింది ఎవరో మనిషని చెప్పొచ్చు. అలా బెదిరించగానే ఆమె వెనక్కి తిరిగింది. శరీరంపై ఏ గాయమూ లేకుండానే మరణించింది. అంటే ఆమె హార్టు ఫేలయిందని. పోనీ విష ప్రయోగం జరిగిందనుకుందాం. అలా అయితే ఆమె శరీరం నల్లబడాలి. అలా జరగలేదు. సో, విష ప్రయోగం జరగలేదు. ఊహించని భయానక దృశ్యం ఆమె కంటబడుండాలి. వెనకున్న వారు మనిషైతే ఆమె గుండె ఆగిపోనవసరం లేదు. స్పృహ పోవచ్చు. కాబట్టి ఆమెకి వెనక కన్పించింది దెయ్యమని వూహించొచ్చు" ఆగాడు శ్రీనివాస్.

"అఫ్‌కోర్స్..." కాసేపు ఆలోచనల్లో పడిపోయాడు డిటెక్టివ్ జలంధర్. ఓ నిమిషం తర్వాత ఇన్స్‌పెక్టర్ వైపు తిరిగి "శవాన్ని పోస్ట్‌మార్టమ్‌కి పంపండి. రిపోర్ట్ అందగానే నాకు ఫోన్ చెయ్యండి." అని చెప్పి జగదీష్ వైపు చూస్తూ—

"మిస్టర్ జగదీష్‌బాబూ! ఈ విషయంలో మీరు దిగులు మానండి. సాధ్యమైనంత త్వరలో మీ కూతురి

మరణానికి కారణమైన దుర్మార్గుల్ని పట్టి ఉరికంబాని కెక్కి స్తాను. మీరు మాత్రం ధైర్యాన్ని విడనాడకుండా యథే చ్ఛగా మీ కార్యక్రమాలు నిర్వహిస్తూ వుండండి. డీలా పడినట్టు వూహా మాత్రంగా కూడ ఎవరికీ అనుమానం కలి గేలా కన్పించకండి. నాతో అవసరం వస్తే ఫోన్ చెయ్యండి." ఫోన్ నెంబరు గల విజిటింగ్ కార్డు అతని చేతిలో పెట్టాడు జలంధర్.

"జలంధర్ గారూ!" అతని చేతులు పట్టుకున్నాడు జగదీష్ బాబు.

మౌనంగా అతని భుజంమీద తట్టాడు జలంధర్ ఓదా ర్పుదా.

"మరి మేం వెళ్ళొస్తాం..." అన్నాడు సిగరెట్ డబ్బా తీస్తూ.

"బాబుగారూ! ఆ గదిలో మీ పుస్తకం మర్చి పోయారు. తీసుకోండి..." గోవిందమ్మ వచ్చింది డైరీతో.

"థాంక్స్..."

"నా కారులో వెళ్ళండి. డేవిడ్!" కేకేశాడు జగదీష్ బాబు.

"నో నో... టాక్సీలో వెడతాం. దార్లో వేరే పనుంది. థాంక్స్..." అందరికీ విష్ చేసి, బయిటికి నడిచాడు డిటె క్టివ్ జలంధర్.

6

గదిలో ఫాన్ గిర గిరా తిరుగుతోంది.

అంతకంటే వేగంగా తిరుగుతున్నాయి జలంధర్ మస్తి ష్కంలో ఆలోచనలు. సిగరెట్ మీద సిగరెట్ తాగు తోన్నాడు. ఆష్ ట్రే సిగరెట్ పీకలతో నిండిపోయింది.

"రాత్రి తొమ్మిది - తొమ్మిదిన్నర మధ్య ప్రాణం పోయింది. ఏదో షాక్ వల్ల ఆమె గుండె ఆగిపోయింది. అంతే కాని ఏ విధమైన ఆయుధం కాని విషపూరితమైన ఏ పదార్థం కాని ఆమె మరణానికి కారణం కాదు. ఇదీ పోస్ట్‌మార్టంలోని సారాంశం.

"అంటే ఆమె ప్రయాణం చేస్తూండగానే ప్రాణం పోయి వుండాలి. ఎంచేతంటే హత్య జరిగిన రాత్రి గోపయ్య తొమ్మిదిన్నరకి పడుకున్నాక పది నిముషాలకి - అంటే తొమ్మిదీ నలభైకి నిద్రపోయానని చెప్పాడుగా!" జలంధర్ వైపు చూస్తూ అన్నాడు శ్రీనివాస్.

"అవును. అయితే కాత్యాయని ఆ సమయంలో ఎక్కడికి వెళ్ళుంటుంది?"

"సినిమాకి."

"తప్పు."

"ఎలా?"

"ఆమె ఉదయం పది గంటల ప్రాంతంలో బయటికి వెళ్ళింది. అంటే అశోక్‌ని కలవటాని కన్నమాట. వాళ్ళ నాన్న వూళ్ళో లేడు. కాత్యాయనికి, అశోక్‌కి శారీరక సంబంధం వుంది... అంటే అతన్తో కామకేళీ విలాసాల్లో మునిగి పోవటానికి సమయం నిర్ణయించుకోవటం కోసం వెళ్లుంటుంది. ఆ పిచ్చి వున్న వాళ్ళకి సినిమాలు చూడాలనే ఆసక్తి వుండదు. ఏమంటావ్?"

"అయితే అశోక్‌ని కలిసుంటుంది. ఆ తర్వాత సాయంత్రం ఐదుకి మళ్ళీ వెళ్ళింది. అంటే అశోక్‌తో గడపటాని కన్నమాట. అంటే మీ వుద్దేశ్యం ఆమెని అనుభవించిన తర్వాత అశోకే..."

"ఆ విషయం అంత త్వరగా నిర్ణయించటానికి వీల్లేదు. అశోక్ ఎంచేత ఆమెతో అంత సన్నిహితంగా వుంటోన్నాడో మనకి తెలీదు. పోనీ అతన్ని కలుద్దామంటే అతని అడ్రస్ లేదు మన దగ్గర... అన్నట్టు అడ్వర్టైజ్మెంట్ ఇచ్చావా?"

"ఇచ్చేశాను గోవిందమ్మ ఇచ్చిన ఫోటోతో సహా. రేపు పేపర్లో వస్తుంది."

"వెరీ గుడ్. ఓ సారి జగదీష్‌బాబు యింటికి వెళ్ళొద్దామా?"

"పదండి...."

శ్రీనివాస్ ఇంకా అంటూండగానే టెలిఫోన్ గణగణ మంది. రిసీవరెత్తాడు జలంధర్.

"హాలో... జలంధర్ స్పీకింగ్..."

"... ..."

"మేమే రావాలనుకుంటున్నాం మీ యింటికి."

"... ..."

".... వాట్!!?" ఉలిక్కిపడ్డాడు జలంధర్ "బయల్దేరి వస్తున్నాం వెంటనే..." రిసీవర్ హుక్‌పై పడేసి, "పద వాసూ! ఒకటి కాదు మరో రెండు హత్యలు జరిగాయ్." గబగబా లేచాడు.

ఆశ్చర్యంగా అతన్ననుసరించాడు శ్రీనివాస్ మారు మాట్లాడక.

7

గోవిందమ్మ, ఖాన్‌లు ఎదురెదురుగా కూర్చునివున్నారు. ఇద్దరి దృష్టీ ఒకే వైపుకి కేంద్రీకృతమైవుంది. ఇద్దరి ముఖాల్లోనూ ఆశ్చర్యం, భయం ప్రస్ఫుటంగా కన్పి

స్తోన్నాయ్. ఇద్దర్లోనూ ప్రాణం లేదు!

"కాత్యాయని హత్యనే పోలివుంది కదూ!" శ్రీనివాస్ వైపు ఆశ్చర్యంగా చూశాడు జలంధర్.

"అవును" శవాల వైపు చూస్తూనే అన్నాడు శ్రీనివాస్.

జగదీష్‌బాబుని ప్రక్కగదిలోకి తీసుకుపోయాడు జలంధర్.

"ఎలా జరిగింది జగదీష్‌గారూ!?"

"ఎలా జరిగిందో నాకూ అర్థం కావటంలేదు. డిటెక్టివ్ గారూ! వీళ్ళిద్దర్నీ చంపటానికి వాళ్ళ కవసరం ఎందు కొచ్చిందో బోధపట్టంలేదు," బాధగా అన్నాడు జగదీష్ బాబు.

"శవాలని ముందుగా ఎవరు చూశారు?"

"గోపయ్య."

"పిలవండి."

కేకేశాడు జగదీష్‌బాబు. వచ్చాడు.

"ముందుగా శవాల్ని చూసింది నువ్వేనా?"

"అవును బాబయ్యా!"

"ఎలా చూశావ్?"

"........"

"ఫర్వాలేదు చెప్పు."

"అయ్యగారు వూళ్ళో లేనప్పుడల్లా మమ్మల్నిద్దర్నీ ఏదో వంకతో బయటికి పంపిస్తూంటుంది బాబయ్యా! మ్యాటినీ కెళ్ళి వచ్చాం. తలుపు తెరవక పొయ్యేసరికి రెండు సార్లు పిలిచిలాగాను. చూసేసరికి..."

"ఇద్దరూ గదిలో వున్నారా! అంటే...?!"

"వారిద్దరికీ..."

"సరే...నువ్వెళ్ళు."

కళ్ళు తుడుచుకుంటూ వెళ్ళిపోయాడు గోపయ్య.

"వారిద్దరికీ సంబంధం వుందని మీకు తెల్సా?"

"తెలీదు. ఏమిటో జలంధర్ గారూ! నాకంతా అయోమయంగావుంది. ఎందుకీ హత్యలు జరుగుతున్నాయ్? నా కుటుంబంపై ఎవరి కన్ను పడింది? నాశనం చెయ్యడానికెందుకు కంకణం కట్టుకున్నారు? అర్థం శుద్ధం తెలియని అమ్మాయిని, నాకర్లెందుకు చంపారు?"

"ఎందుకేనా మంచింది. మీరు, మిగిలిన వారు కాస్త జాగ్రత్తగా వుండండి."

"అంటే..."

"ఏమో చెప్పలేం. ముందు జాగ్రత్తలో వుండటం మంచిదేగా!"

"దయచేసి వాళ్ళని త్వరగా పట్టుకోండి డిటెక్టివ్ గారూ! నాకు చాలా భయంగా వుంది..."

"ఇకపై అహర్నిశలూ అదే పనిపై తిరుగుతాను. హంతకుడు ఎవరేనా కానీ, వారంలోగా పట్టుకుని వురికంబం ఎక్కిస్తాను. అంతవరకూ నిద్రపోను..." నిశ్చల గంభీర స్వరంతో అన్నాడు జలంధర్!

8

అతనికి పాతిక వుండొచ్చు వయసు...

ఎర్రగా వున్నాడు. కోల ముఖం. నొక్కుల జుట్టు. సన్నని మీసకట్టు, ఆకర్షణీయమైన విగ్రహం. బలిష్ఠమైన కండలు తిరిగిన శరీరం. తెల్లని షర్టు టక్ చేశాడు. చేతిలో న్యూస్ పేపరు.

"రండి..." అన్నాడు జలంధర్ అతన్నే చూస్తూ.

"జలంధర్ గారు మీరేనా?" అన్నాడతను లోని కొస్తూ.

"అవును."

"మీరు డిటెక్టివులైతే కావచ్చు. కాని యిలా చెయ్యడం ఏమీ బాగోలేదు నన్నల్లరి పెట్టడంలో మీ ఉద్దేశం?"

"ఏం చేశాను?" చిరునవ్వుతో అన్నాడు జలంధర్.

"మీరు చేసిన పనేమిటో మీకే తెలీదూ!" న్యూస్ పేపర్ని జలంధర్ ముందుకి తోశాడు.

పేజీలు తిరగేశాడు జలంధర్.

వధువు కావలెను

డిగ్రీ చదువు చదివి, పెద్ద వ్యాపారము చేయుచున్న పాతికేళ్ళ అందమైన ఈ యువకునకు వధువు కావలెను. కులమేదైనా పట్టింపులేదు. 23 సం॥ల వయసు. చదువు, సంస్కారం గలిగి సంసారమును చక్కదిద్దుకొను నేర్పు ఓర్పులున్న చాలును. అభిలాషగల వారు తమ ఫోటోవున్నచో ఈ దిగువ చిరునామాకు పంపుతూ ఉత్తరం రాయండి.

జలంధర్
13-13, అబిద్ రోడ్,
హైదరాబాదు.

"ఈ రోజే పేపర్లో వచ్చింది. ఇప్పట్నుండే ఫోటోల కోసం వస్తే ఎలా?" నవ్వాడు జలంధర్.

"మీకు నవ్వులాటైంది. నాకేమో నాస్నేహితుల్లో తల వంపులైంది. మొన్నటివరకూ ఉద్యోగంకోసం కాళ్ళ

రగదిరిగి ప్రతిరోజూ నిరాశనే ఎదుర్కొన్న నేనేమిటి? పెద్ద వ్యాపారం చెయ్యడమేమిటి? పెళ్ళికోసం ప్రాకులాడటమేమిటి? పైగా ఫోటోతోసహా పేపర్లో ప్రకటన చెయ్యటమేమిటి?

"...మాకు తెలీకుండా అంత పెద్దవ్యాపార మెలా చేస్తున్నావ్? అసలా వ్యాపార మేమిటి? అని ఫ్రెండ్సందరూ నన్నల్లరి పెట్టిస్తున్నారు. అసలు మీకు నాతో అవసరమేమిటి? హేళన చెయ్యటానికి మీకు నేనే దొరికానా?"

"మీతో అవసరం వుండే పిలిపించాం మిస్టర్ అశోక్!" గంభీరంగా అన్నాడు జలంధర్.

"ఏమిటా అవసరం?"

"మీకు కాత్యాయని తెల్సా?"

"ఏ కాత్యాయని?"

"మీకెంతమంది కాత్యాయన్లు తెలుసు?"

తడబడ్డాడశోక్.

"జగదీష్‌బాబు కూతురు."

"తెలుసు."

"ఆమె హత్య చెయ్యబడింది."

"అం...!!??" ప్రక్కలో బాంబు ప్రేలినట్టు అదిరిపడ్డాడు అశోక్. "...జలంధర్ గారూ! మీరెవర్ని గురించి చెబుతున్నారు?"

"మీరు ప్రేమించిన కాత్యాయని గురించే!"

"ఈ దారుణ హత్య యెలా జరిగింది? నా కాత్యాకి శత్రువు లెవరున్నారు? నేను ప్రాణపదంగా ప్రేమిస్తోన్న నా కాత్యా నెవరు చంపారు డిటెక్టివ్ గారూ!?"

మాట్లాడలేదు జలంధర్. అతన్ని కాసేపు బాధపడ నిచ్చాడు.

"...ఇద్దరం బాగా ప్రేమించుకున్నాం. పెళ్ళిచేసుకో వాలని కలలు గన్నాం. అంతలోనే ఇంత దారుణమైన వార్త వినవలసొస్తుందని కల్లోకూడ అనుకోలేదు. ఎవరికీ ద్రోహం చెయ్యని నా కాత్యాని హత్య చేయ్యాలనే దురాలోచన ఏ దుర్మార్గుడికి కలుగుతుంది?...ఇంకెవడికి? వాడికే కలిగుంటుంది." పళ్లు నూరాడు అశోక్.

"ఎవరికి?"

"జగదీష్‌బాబు గాడికి!"

నమ్మలేనట్టు చూశాడు జలంధర్.

"తండ్రి కూతుర్ని హత్య చెయ్యటమా?"

"తండ్రే కూతుర్ని రేప్ చేస్తోన్న ఈ రోజుల్లో హత్య చెయ్యటంలో వింతేముంది జలంధర్ గారూ!... అయినా అతడేమీ కనలేదుగా కాత్యాని!!"

"వివరంగా చెప్పండి."

"కాత్యాయని అతడి స్వంత కూతురు కాదు. అన్న కూతురు. అతనికి పిల్లల్లేరు."

"అని మీకెలా తెలుసు?"

"కాత్యానే చెప్పింది?"

"కాత్యా మీకెలా పరిచయం?"

ద్రవిస్తోన్న కళ్ళు తుడుచుకుని ప్రారంభించాడు అశోక్.

"అవి నేను బియ్యే చదువుతోన్న రోజులు. అప్పుడు మేం సనత్‌నగర్‌లో వుండే వాళ్ళం. ఓసారి సెలవుల్లో స్నేహితులం పదిమందిమి కలిసి మద్రాసు టూరిస్ట్

ప్రోగ్రామ్ వేసుకున్నాం. చూడాల్సిన వన్నీ చూసుకుని మెరీనా బీచి చేరుకున్నాం. అక్కడికి వీళ్ళూ వచ్చారు టూరిస్ట్ ప్రోగ్రామ్ వేసుకునే!

కాత్యాకి సముద్ర స్నానం చేసే అలవాటు లేదేమో, తల పైకెత్తి నీళ్ళలోకి వెళ్ళటం వల్ల కాబోలు... అలలు ఆమెని లోపలికి లాక్కున్నాయ్. ఎవరి ఆనందంలో వాళ్ళుండటం మూలాన ఆమె స్నేహితురాళ్ళు ఎవరూ పట్టించుకో లేదు. అనుకోకుండా నేను చూశాను. పరుగెత్తుక వెళ్ళి ఆమెని కాపాడాను..."

"అయితే అలా పరిచయమయ్యారన్నమాట మీరు యిద్దరూ."

"అవును."

"మీ పరిచయం వృద్ధెలా అయ్యింది?"

"ఇద్దరిదీ హైదరాబాదేనని తెలిసిపోయింది. ఇక్కడి కొచ్చాక ఓసారి సినిమాలో కలుసుకున్నాం. వాళ్ళ నాన్నకి తెలిస్తే కేకలేస్తారని బయట బయటే కలుసుకుం టూండే వాళ్ళం."

"సినిమాల్లోనా?"

"సినిమాల్లో కొన్నిసార్లు, పబ్లిక్ గార్డెన్స్‌లో కొన్ని సార్లు, టాంక్‌బండ్ వద్ద కొన్నిసార్లు. పరిచయం పెరి గింది. ప్రేమగా మారింది. బాగా ప్రేమించుకున్నాం. కాత్యాయని తన సర్వస్వం నాకర్పించింది. త్వరలోనే పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నాం."

"ఎలా? జగదీష్‌బాబు అబ్జెక్ట్ చేస్తే?"

"రిజిస్టర్ మేరేజ్ చేసుకునే వెళ్ళాలనుకున్నాం. ఆశీర్వదిస్తే సరి. లేకపోతే మా దారి మాది."

"ఇలా చేద్దామంటే కాత్యాయనేమంది?"

"కాత్యానే ఈ సలహా యిచ్చింది."

"మీరు చివరి సారిగా ఆమె నెప్పుడు కలుసుకున్నారు?"

"మొన్న రాత్రి."

"ఎక్కడ?"

"హోటల్ ఫుల్‌మూన్‌లో."

"మీరు హోటల్ నుండి ఎన్ని గంటల కొచ్చారు బయటికి?"

"సరిగ్గా తొమ్మిదికి."

"ఆ తర్వాత మీరు ఆమెతో వెళ్ళలేదా?"

"లేదు. తన కారులో డ్రాప్ చేస్తానంది. కాని ఆ సమయంలో నాకు అర్జంట్ పనుండింది. బరఖత్ పుర చమన్ వద్ద 'శోభ ఎంటర్ ప్రైజెస్'లో నాకు టైపిస్ట్ పోస్టిప్పిస్తానని మేనేజర్ చెప్పాడు. తొమ్మిది_తొమ్మిదిన్నర మధ్య ఇంటికి రమ్మన్నాడు. కాత్యా ఇంకాసేపు తనతో గడపమంది. కాని ప్రస్తుత పరిస్థితుల్లో నా కాళ్ళ మీద నేను నిలబడ్డం ముఖ్యం. కాత్యా నాకు దూరమయ్యేది కాదు. క్షణకోద్రేకానికి లొంగితే అవతల ఉద్యోగం చేజారి పోతుంది. అందుకే వెళ్ళాను విడిగా."

"కార్లో వెళ్ళలేకపోయారా? ఆమె డ్రైవ్ చేసుండేదిగా!"

"ఆవిడ స్వభావం మీకు తెలీదు. కామం ఎక్కువ. పైగా మొన్న కాస్త అసంతృప్తిగా కన్పించింది. ఆ సమయంలో ఏదీ పట్టించుకోదు. కారులోనే తన కార్యానికి పునిగొల్పి వుండేది. అందుకే విడిగా వెళ్ళాను."

"ఉద్యోగం వచ్చిందా?"

"వచ్చింది. కాని అంతకంటే ముఖ్యమైందే పోయింది."

అశోక్ కళ్ళల్లో నీళ్లు తిరిగాయ్.

"మీ రెప్పుడు కలిసినా ఫుల్ మూన్ లో నే కలిసేవారా? లేక మరేదైనా వుందా?"

"మొదట్లో హోటల్ అశాక్ కి రెండు మూడుసార్లు వెళ్ళాం. కాని అక్కడికంటే ఫుల్ మూన్ లో ఎక్కువ కంఫర్ట్స్ కన్పించాయ్. అందుకే ప్రతిసారీ అక్కడికే వెళ్ళే వాళ్ళం. అక్కణ్నుంచి వస్తూ వస్తూ హోటల్ కని పక్కకి వచ్చి చెరో కోకాకోలా తాగేసి ఆమె అటు నే నిటు వెళ్లే వాళ్ళం."

"మీరిప్పుడు ఎక్కడుంటున్నారు?"

"ఫ్రెండ్ రూమ్ లో వుంటున్నాను."

"అత నేం చేస్తాడు?"

"రూప ఎంటర్ ప్రెయిజెస్ అని మా ఆఫీసుప్రక్కన్నే వుంది. అందులో అతడు స్టెనోగ్రాఫర్. పేరు మోహన్. ఆ రెండాఫీసుల ప్రొప్రైటర్లూ అన్నదమ్ములే."

"అతనికి మీ ప్రేమ విషయం తెల్సా?"

"రెణ్ణెల్ల క్రితం నేనే చెప్పాను."

"ఏమన్నాడు?"

"కంగ్రాట్స్ చెప్పాడు."

"మీ విషయాల్లో తల దూర్చేవాడా తరచూ?"

"లేదు. అతనూ ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. పేరు యశోధర. ఎప్పుడూ ఆ అమ్మాయిని గురించే చెబుతూండే వాడు. అతని సమస్యలు చెబుతూ నా సలహాలు తీసుకునే వాడు కాని, నా గురించి ఒక్కటీ అడిగేవాడు కాదు."

"బైదిబై...ఇందాక మీరు జగదీష్‌బాబుపై అనుమానం వెలిబుచ్చారు. వివరించగలరా?"

"వివరాలు నాకూ తెలీవు. బహుశ మా సంగతి అతనికి తెలిసిపోయివుండొచ్చు. కాత్యాయని నన్ను చేసుకుంటే తన పరువుకి భంగం కలగొచ్చని గుట్టుగా హత్యచేసుండొచ్చు. అప్పటికింకా నాకు ఉద్యోగం కూడ లేదుగా!"

పరువును గురించి జగదీష్‌బాబు అన్న మాటలు గుర్తొచ్చాయ్ జలంధర్‌కి.

"మీరు, కాత్యాయని ప్రేమించుకున్నట్లు, పెళ్ళిచేసుకోవాలనే ఉద్దేశ్యంతో వున్నట్టు జగదీష్‌బాబుకి తెల్సా?",

"ఈ విషయం రూఢిగా చెప్పలేను."

"మెనీ థాంక్స్ మిస్టర్ అశోక్! మీరు కలవటంవల్ల కేసుకి సంబంధించిన కొత్త వివరాలు తెలిశాయ్. మీ అడ్రస్ మాకు తెలీదు. అందువల్ల మిమ్మల్నీవిధంగా పిలిపించాల్సొచ్చింది. మావల్ల మీకు తలవంపులు జరిగినందుకు మన్నిస్తారు కదూ!"

"ఎంత మాట సార్! అసలు విషయం తెలీక తొందరపడ్డాను. క్షమించండి. మరేం ఫర్వాలేదు...డిటెక్టివ్ గారూ! నా కాత్యా హత్యకి కారణమైనవాణ్ణి నాకు చూపించండి. ప్లీజ్..." నీళ్లు నిండిన కళ్ళతో అన్నాడు అశోక్.

'తప్పకుండా...' అన్నట్టు అతనివైపు చూశాడు జలంధర్. అడ్రసు తీసుకొని అతనిని పంపించివేశాడు.

9

తలుపు తెరిచి మెల్లిగా లోపలి కడుగుపెట్టాడు జలంధర్. లోపల చీకటిగా వుంది! కన్ను పొడుచుకున్నా

ఏ వస్తువూ కన్పించేలా లేదు. నెమ్మదిగా తలుపులు మూసి జేబులోంచి పెన్ టార్చి తీసి చుట్టూ చూశాడు. జాకెట్లు, బ్రాలు తగిలించబడి వున్నాయి హేంగర్స్‌కి. దాని ప్రక్కనే ఓ టేబులు, ఓ బీరువా, ఓ మంచం కన్పించాయ్.

బీరువా వద్దకి వెళ్ళి లాగి చూశాడు. రాలేదు. జేబులోంచి మాస్టర్ కీ తీసుకుని లోనికి దూర్చి రెండుమూడుసార్లు అటుయిటు తిప్పాడు. 'టక్'మని శబ్దం విన్పించింది. చిన్నగా నవ్వుకుని తలుపులు తెరిచాడు.

అన్నీ ఖరీదైన చీరలే! వరుసగా అమర్చబడివున్నాయి. పై అరలో కాత్యాయని ఫొటో ఫ్రేమ్‌లో వుంది. రెండో అరలో ఆమె ధరించే నగలున్నాయ్. మూడోదాన్లో ఏవేవో పుస్తకాలున్నాయ్.

గబగబా పుస్తకాలన్నీ తిరగేశాడు. కావలసిందేదీ కన్పించలేదు. అన్నీ సర్దేసి చీరలు ఒక్కొక్కటే బైటికి తీసి మడతలు విప్పి చూడసాగాడు.

ఓ చీర మడతలో మడిచిన కాగితం కన్పించింది. ఆత్రంగా మడతలు విప్పాడు. జలంధర్ కండ్లు మెరిశాయ్.

దాన్ని జేబులో పెట్టేసుకుని బీరువా అంతా వెదికాడు. ఏదీ దొరకలేదు. ఆఖ్రైరా తలుపులు మూసి, వచ్చిన దారినే బయటపడ్డాడు.

ఇంటికి చేరుకున్న తర్వాత ఆ ఉత్తరం తీసి తీరికగా చదివాడు.

"కాత్యాయనీ!

నీకోసం నేనెంతగా తపిస్తున్నానో నాకే తెలీటం లేదు. కాని నువ్వు ప్రతిసారీ నన్ను విదిలించి కొడు

తున్నావ్. ఏం? ఆ అశోక్ గాడికంటే నేనందంగా లేనా? వాడికి ఆస్తి లేదు. ఏం సుఖపడదామని వాణ్ణి చేసుకుందా మనుకుంటున్నావ్?

నన్ను చేసుకోమని చెప్పను. కాని ఒక్కసారి నీవద్ద అమరసుఖాన్ని పొందాలని ఎన్ని రోజులుగా ఎదురు చూస్తున్నానో తెలుసుకుంటే నువ్విలా ప్రవర్తించవ్. మీ యిద్దరూ ఎప్పుడు, ఎక్కడ కల్సుకుని ఏం చేస్తుందేదీ నాకు తెల్సు. అంతేకాదు. అశోక్ వల్ల నువ్వు నెల తప్పి టాబ్లెట్స్ మింగింది కూడ నాకు తెలుసు!

ఇవన్నీ తెలిస్తే నీ పరువు, మీ నాన్న పరువు ఎందులో కలుస్తాయో ఒక్కసారి వూహించుకో. ఇది నా ఐదో ప్రయత్నమే కాదు. ఆఖరి ప్రయత్నం కూడ! గుర్తుంచుకో. నీ నిర్ణయం ఈ సాయంత్రం నాలుగులోగా తెలియజెయ్.

నీ పొందుకోసం తపిస్తోన్న
నీ
మదన్."

మరోసారి చదువుకున్నాడు జలంధర్ ఆ ఉత్తరాన్ని.

'ఎవరీ మదన్? తేదీ వెయ్యలేదు. మిగత నాలుగుసార్లూ అతడు ఉత్తరాలే రాశాడా? మరి తనకి చివరి ఉత్తరమే దొరికిందే! మిగత నాలుగూ ఏమయ్యాయ్? అవి కూడ కాత్యాయని గదిలోనే వున్నాయా? లేక చించేసిందా?

ఇంతకీ మదన్ ప్రయత్నం నెరవేరిందా? కాత్యాయని అందుకంగీకరించిందా? ఐదోసారి కూడ విముఖత చూపించిందనే కోపంతో మదనే ఆమెని హత్యచేశాడా? లేక ఆమె అంగీకరించిన పక్షంలో ఆ సంగతి తెలుసుకుని అశోక్ ఆమెని చంపాడా? హత్య చేసినవాడు ఆ

కోపంలో మదన్‌ని మాత్రం వూరికే వదుల్తాడా?'

జలంధర్ ఆలోచల కంతరాయం కలిగిస్తోన్నట్టుగా టెలిఫోన్ గణగణ మోగింది.

విసురుగా ఫోనెత్తి "హలో. డిటెక్టివ్ జలంధర్ స్పీకింగ్." అన్నాడు.

"నేను...చక్రవర్తిని." అవతల్నుండి విన్పించింది.

"ఏమిటి విశేషాలు?"

"అడుగుదామనే ఫోన్ చేశాను. ఏమైనా తెల్సిందా?"

"కేసంతా గందరగోళంగా వుందని మాత్రమే తెల్సింది."

"అదేమిటి?"

"హత్య చేసిందెవరో తెలీటంలేదు. పైగా ఫలానా అని చెప్పటానికి వీలులేకుండా గుంభనంగా వున్నారు. ఎవర్ని గురించి ఆలోచించినా వారే హత్యచేసినట్లు తోస్తోంది."

"ఎనీ హెల్ఫ్ ఫ్రమజ్?"

"వద్దొద్దు. నీకు ముందే చెప్పాగా! జగదీష్‌బాబు ఆ భారాన్ని మాపైనే వుంచాడు. పరిశోధన అతి రహస్యంగా జరగాలన్నాడు. అయినా యిందులో అంత కష్టపడాల్సిందేదీలేదు చక్రవర్తీ! ఒక్క చిన్న క్లూ దొరికితే చాలు. కేసు తేలిగ్గా విడిపోతుంది.

కాని, ప్రత్యర్థులు చిన్న ఆధారాన్ని కూడ ఇవ్వటంలేదు. అంటే ఏ చిన్న ఆధారం దొరికినా ఇమ్మీడియట్‌గా పట్టుబడతామనే భయం అనుక్షణం వారి వెంటే వుంది! ఈ కేసులో నాతోబాటు పనిచేసే అవకాశం ఎటూ లేదుగా నీకు! ఓ పని చెయ్."

"ఏమిటది?"

"మొన్నటి 'ఆంధ్రప్రభ'లో ఓ ఫొటో వచ్చిందిగా వధువు కావాలని! అతనిది రాజమండ్రి. నువ్వెలాగైనా అక్కడ ఎంక్వయిరీ చేయించి అతని గురించి వాకబు చెయ్యి. అతడెలాంటివాడో తెల్సుకుని నాకు ఫోన్ చెయ్."

"అదెంత పని?"

"శ్రీనివాస్‌ని మద్రాసు పంపించాను, ఈ రోజు రేపట్లో రావచ్చు."

"ఓ.కే. బాయ్!" క్లిక్‌మని శబ్దం వచ్చింది. జలంధరూ ఫోన్ పెట్టేశాడు. పెట్టీ పెట్టగానే మళ్ళీ మ్రోగింది ఫోను. ఎత్తాడు.

"జగదీష్‌ని మాట్లాడుతున్నాను. జలంధర్ గారా!?" ఆందోళనగా వుంది కంఠం.

"అవును. నేనే!"

"మీరు వెంటనే రావాలి."

"ఏం జరిగింది జగదీష్ గారూ?"

"వచ్చాక చెబుతాను." జగదీష్‌బాబు కంఠంలో వణుకు స్పష్టంగా విన్పిస్తోంది!

"పది నిమిషాల్లో అక్కడుంటాను." ఫోన్ పెట్టేసి ఆత్రంగా లేచాడు డిటెక్టివ్ జలంధర్!

పది నిమిషాల్లో జగదీష్‌బాబు ఇంటిముందాగింది కారు.

పరిగెడుతూన్నంత వేగంగా లోనికి నడిచాడు జలంధర్.

"ఏమిటి జగదీష్ గారూ!?"

"అటు చూడండి."

చూశాడు జలంధర్.

గోపయ్య, డేవిడ్ ఇద్దరూ నాలుగో మెట్టుపై పడి వున్నారు. ఇద్దరిలో ప్రాణం లేదు. ఇద్దరి మొహాల్లోనూ భయసంభ్రమాలు!

"మైగాడ్!" అప్రయత్నంగా అన్నాడు జలంధర్.

"జలంధర్ గారూ...!" ఏడుస్తూ అన్నాడు జగదీష్ బాబు. 'తర్వాతి వంతు నాదే'నన్నట్టుగా వుందతని ముఖం.

ఏం మాట్లాడాలో తోచలేదు జలంధర్‌కి.

10

శ్రీనివాస్ వైపు తిరిగాడు వకీలు గోపాలశర్మ.

"జగదీష్‌బాబుగారి వకీలు మీరే కదూ?"

"అవును."

"ఆయనకో కూతురుంది కదూ?"

"ఉంది."

"ఆ ఆస్తి ఆమె పేరుతో వుందా? లేక వాళ్ళ నాన్న పేరుతో వుందా?"

"జగదీష్‌బాబు అనుమతి లేనిదే మీకా వివరాలు చెప్పలేను. ఈ వివరాలన్నీ ఎందుకడుగుతున్నారు?" అనుమానంగా అడిగాడు గోపాలశర్మ.

"ఆ అమ్మాయి హత్య చెయ్యబడింది."

"నిజమా?" ఉలిక్కిపడ్డాడు గోపాలశర్మ,

"అవును."

"మొన్నటివరకూ నేను హైద్రాబాదులోనే వున్నాను. నాతో చెప్పనేలేదే!"

"ఆయనెవరితోనూ చెప్పలేదు."

"........."

"నేనడిగిన ప్రశ్నకి మీరు జవాబు చెప్పనేలేదు."

"అడగండి."

"ఆ స్తి ఎవరి పేరుతో వుంది?"

"అమ్మాయి పేరుతో వుంది."

"తన పేరుతో రాయించుకోవాలనుకుంటున్నట్టు మీతో ఎప్పుడేనా అన్నారా జగదీష్‌బాబు?"

"అన్లేదు. ఎందుకంటారు? ఆయనే బలవంతంగా అమ్మాయి పేరుతో చేయిస్తేనూ!"

"ఇంతకుముందు ఎవరి పేరుతో వుండింది? వివరంగా చెప్పండి."

"ఆస్తి జగదీష్‌బాబు అన్నయ్య సుందరరాజుగారిది. ఆయన చనిపోయేప్పుడు అమ్మాయి సంవత్సరం పిల్ల. పసి పిల్లను తమ్ముడి చేతిలో పెడుతూ ఆ స్తి జగదీష్‌బాబు గారి పేరుతో రాయిస్తానన్నారు సుందరరాజు. కాదూ కూడదని పట్టుబట్టి బలవంతంగా ఆ స్తంతా అమ్మాయి పేరనే రాయించారు జగదీష్‌బాబు. ఆ తర్వాత ఆయన సంపాదించింది కూడ అమ్మాయి పేరుతోనే వుంది."

"థాంక్స్. మంచి సమాచారం అందించారు."

"నో మెన్షన్. ఇంకా ఏమైనా చెప్పాలా?"

"అవసరంలేదు." అని లేచాడు శ్రీనివాస్.

11

రాత్రి ఒకటీ ముప్పావైంది.

జగదీష్‌బాబుకి నిద్రపట్టటంలేదు. ఫాన్ తిరుగుతున్నా ఒళ్ళంతా చెమటలు పట్టసాగాయ్. ప్రక్కగా చూశాడు. ఇద్దరు కానిస్టేబుల్స్ మఫ్టీలోపడుకొని నిద్రపోతున్నారు.

'వాళ్ళిద్దరూ తనకి తోడుగా పడుకున్నారు. మరో యిద్దరు బయట కాపలా వున్నారు.' మళ్ళీ గుర్తుచేసుకొని భయాన్ని మర్చిపోదామని ప్రయత్నించాడు. సాధ్యం కాలేదు!

'కాత్యాయని హత్య చెయ్యబడింది. నలుగురు నౌకర్లూ ప్రాణాలు కోల్పోయారు. ఇక మిగిలింది తను.'

'తను మాత్రం బ్రతికుండి ఏం చెయ్యాలి? ఎవర్నుద్ధరించాలి? తను అనుకున్నది జరగలేదు. అన్నయ్య దగ్గర మాట తప్పాడు. కాత్యాయన్ని అపురూపంగా పెంచి పెళ్ళిచేస్తానని తను ఆయనకి వాగ్దానం జేశాడు. మొదటి దైతే నెరవేర్చుకోగలిగాడు కాని, ఆమె పెళ్ళి మాత్రం చెయ్యలేకపోయాడు. ఈలోగా విధి తన కుటుంబంతో చిత్రంగా ఆడుకుంది!'

జగదీష్‌బాబు మనసు వికలమైపోయింది. మంచంపై నుండి లేచాడు. తిన్నగా కిటికీవద్దకి నడిచాడు.

రివ్వున గాలి లోపలికొస్తోంది. ఏదో ఆలోచిస్తూ కాసేపయ్యాక అలా బయటికి చూశాడు. అంతే!

గట్టిగా కేకేసి 'దభీ'మని క్రింద పడిపోయాడు!!!

నిద్రపోతోన్న యిద్దరూ ఉలిక్కిపడి లేచారు. ఆశ్చర్యంతో జగదీష్‌బాబువద్దకి నడిచారు.

స్పృహలో లేడతను.

"ఎలా వచ్చారిక్కడికి? ఏం జరిగింది?" ఒకడు ప్రశ్నించాడు. 'ఏమో'నన్నట్టు చూశాడు రెండోవాడు.

"ఏం చేద్దాం?"

"జలంధర్ గారికి ఫోన్ చేద్దామా?"

"నువ్వెళ్ళి చేసిరా. నేనిక్కడుంటాను."

రెండోవాడు పరుగుతీశాడు.

బయట వున్న యిద్దరూ కూడ పరిగెత్తుకొచ్చారా కేక విని.

"ఏమైంది?"

"ఏం లేదు. మేం నిద్రపోతున్నాం. గట్టిగా కేక విన్పించి లేచాం. చూసేసరికి యిక్కడ పడున్నారు."

ఇంతలో క్రిందకి వెళ్ళినవాడు పైకొచ్చాడు. "వస్తున్నారు" అన్నాడు.

నలుగురూ అక్కడే కూర్చున్నారు.

పావుగంట భారంగా గడిచింది.

"ఏం జరిగింది?" ఆత్రంగా ప్రవేశించాడు జలంధర్.

"మమ్మల్ని పడుకోమన్నారు సార్! 'అవసరమైతే లేపండి.' అని చెప్పి పడుకున్నాం. ఉన్నట్టుండి గట్టిగా కేక విన్పించింది. అదిరిపడి లేచి చూస్తే మంచంమీద పడుకున్నవారు ఇక్కడ పడున్నారు. అప్పటికే స్పృహ పోయింది." అన్నాడో కానిస్టేబుల్ నమ్రతగా.

"మీరిద్దరూ ఎక్కడున్నారు?"

"క్రింద మేలుకునే వున్నాం సార్!" అన్నారు క్రింద వుండిన యిద్దరూ.

"ఎవరేనా వచ్చారా?"

"ఎవరూ రాలేదు సార్."

"కిటికీ వద్ద పడిపోయారంటే అవతల ఏదో కన్పించి వుండాలి. చూశారా?"

"చూశాం సార్... ఎవరూ కన్పించ లేదు."

మౌనంగా జగదీష్‌బాబు వద్దకు వెళ్ళి చూశాడు జలంధర్. చలనరహితంగా పడున్నాడు. నాడి బలహీనంగా

కొట్టుకుంటోంది.

"గ్లాసులో నీళ్ళు తీసుకురా..."

తెచ్చాడో కానిస్టేబుల్. ముఖంపై చిలకరించాడు జలంధర్. కాసేపయ్యాక నెమ్మదిగా కళ్ళు తెరిచాడు జగదీష్‌బాబు.

"ఏం జరిగింది జగదీష్‌గారూ?" మృదువుగా ఆత్రంగా ప్రశ్నించాడు జలంధర్.

ఏదో చెప్పాలని ప్రయత్నించాడు జగదీష్‌బాబు. కాని ప్రయోజనం లేకపోయింది. రెండు నిమిషాల తర్వాత ఎడమ అరచేతిపై కుడిచేతి చూపుడు వ్రేలితో ఒకదాని తర్వాత ఒకటి మూడు అక్షరాలను వ్రాశాడు.

"...దెయ్యమా?!" ఆశ్చర్యంగా అన్నాడు జలంధర్.

'అవు'నన్నట్టుగా తలూపి మళ్ళీ స్పృహ తప్పాడు జగదీష్‌బాబు!

పది క్షణాలు ఆలోచిస్తూ వుండిపోయాడు జలంధర్. ఆ తర్వాత ఒక నిశ్చయానికొచ్చాడు.

"డాక్టర్ వైద్యనాథన్‌కి ఫోన్ చేసి ట్రీట్‌మెంటిప్పిస్తూండండి. నేను మళ్ళీ ఉదయం వస్తాను..." చెప్పేసి బయటికి నడిచాడు.

12

సాయంత్రం ఏడుగంటలైంది.

జలంధర్ ఆఫీసు గదిలో...

డిటెక్టివ్ జలంధర్, అతని అసిస్టెంట్ శ్రీనివాస్, జగదీష్‌బాబు, వకీలు గోపాల శర్మ, అశోక్‌కుమార్, అతని రూమ్‌మేట్ మోహన్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ చక్రవర్తి మరి నలుగురు కొత్తవాళ్ళు, డాక్టర్ వైద్యనాథన్... అందరూ కుర్చీల్లో కూర్చుని వున్నారు.

సిగరెట్ వెలిగించుకొని చిన్నగా దగ్గి ప్రారంభించాడు జలంధర్.

"...డియర్ ఫ్రెండ్స్! ఈ రోజు ఈ సమయంలో మీ అందర్నీ ఇక్కడ సమావేశ పరచటానికో ముఖ్య కారణం వుంది. అదే వివరించబోతున్నాను. కాని అంత కంటే ముందు ఈ కేసుని ఒక్కసారి నెమరు వేసుకుందాం...

"జగదీష్‌బాబుగారి అన్న కూతురు మిస్ కాత్యాయని హత్య చెయ్యబడింది. ఆమే కాదు. వాళ్ళింట్లో మొత్తం నలుగురు నౌకర్లూ హత్య చెయ్యబడ్డారు. జగదీష్‌బాబు మీద కూడ హత్యా ప్రయత్నం జరిగింది. జరిగిన హత్యలన్నీ చాల చిత్రంగా జరిగాయ్. అంటే ఏ విధమైన ఆయుధ ప్రయోగంకాని విషప్రయోగం కాని జరుగలేదు! అందరూ గుండె ఆగి మరణించారు. దీన్ని బట్టి మాత్రం ఆలోచించగా ఈ హత్యలు చేసింది ఓ దెయ్యమని తేలింది..."

"దెయ్యమా?" ఆశ్చర్యం పట్టలేక అడిగాడు వకీలు గోపాల శర్మ.

"అవును."

అందరూ ఆశ్చర్య పోయారు.

"ఆఁ... హత్యలు చేసింది ఓ దెయ్యమనే తేలింది. ఆ దెయ్యం గురించి డిస్కషన్స్ జరిపాక 'మనిషా? దెయ్యమా??' అన్న ప్రశ్న వుద్భవించింది. ఈ ఉదయం ఆ ప్రశ్నకి తగు జవాబు లభించింది..." అని చెప్పి కాసేపు ఆగాడు జలంధర్.

అందర్లోనూ ఉత్సుకత తలెత్తింది. ఏం చెప్తాడోనని

ఆత్రంగా అతని వైపే చూడ సాగారు.

"...హత్యలు చేసింది దెయ్యం కాదని, మనిషేనని తేలిపోయింది...

"ఓ మనిషిని నిర్దాక్షిణ్యంగా చంపగలడు మనిషి. కాని ఆ మనిషినే మరో మనిషి చంపటానికి వస్తే కాళ్ళు పట్టుకుంటాడు... ఎందుకు పట్టుకోవాలి? తనింతకు ముందే మరో మనిషిని చంపాడే! ప్రాణాలపై తీపి ఇతడికైనా వున్నది? తనింతకు ముందు చంపిన వ్యక్తికి మాత్రం వుండదా?

"ఈ విషయం ఆలోచిస్తే అసలు హత్యలే జరగవ్!

"...సృష్టిలో అక్కడక్కడా ఇంకా నరమాంస భక్షకులున్నారు. కాని వారంతా నాగరికత తెలీని వారు. అసలు 'నాకరికత' అన్న పదాన్ని కూడ అర్థం చేసుకోలేని వాళ్ళు. అలాంటి వాళ్లు ఈ పని చేశారంటే 'ఏమో' ననుకోవచ్చు. కాని పెద్ద చదువులు చదువుకొని నాగరికత నలవరచుకొన్న మనుషులు యిటువంటి పనులు చెయ్యటం సిగ్గు పడాల్సిన విషయం...

"ఆ వ్యక్తి భయంకరమైన దెయ్యం కంటే భయంకరమైనవాడు! నరమాంస భక్షకుడికంటే అనాగరికుడు!!

"...అటువంటి వ్యక్తిని మీకిప్పుడు చూపించబోతున్నాను. ఆ వ్యక్తి ఎక్కడో లేడు... మన మధ్యలోనే వున్నాడు!!

అందరూ దిగ్భ్రాంతులై పోయారు. ఆశ్చర్యంతో ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

"ఏమీ ఎరగని వాడిలా అలా చూస్తారేం? సంకెళ్ళు తొడిగించుకోటానికి సిద్ధం కండి మిస్టర్ మోహన్... ప

మీరే మిస్టర్ మదన్ మోహన్!" గంభీరంగా అన్నాడు డిటెక్టివ్ జలంధర్!

"నేనా!?" నిశ్చేష్టుడై పోయాడు మోహన్.

"ఇది చాల అన్యాయం. అశోక్ నా ప్రాణ స్నేహితుడు. అతనికి నేను ద్రోహం చేస్తానా?" అంటూ నెమ్మదిగా జేబులో చెయ్యి దూర్చాడు మోహన్!

"అశోక్! అతని జేబులో టాబ్లెట్సున్నాయి. వాటిని మింగనివ్వకండి..." గట్టిగా అరచాడు జలంధర్.

అంతవరకూ శిలాప్రతిమలా కూర్చుండిపోయిన అశోక్ అమాంతంగా పైకి లంఘించి బలవంతంగా మింగబోతున్న మోహన్ చేతిలోని టాబ్లెట్స్‌ని లాక్కున్నాడు!

చక్రవర్తి పిలుపు నందుకుని మఫ్టీలో వున్న కానిస్టేబుల్స్‌లో ఒకడు లేచి మదన్ మోహన్‌కు సంకెళ్లు తగిలించాడు.

మదన్ మోహన్ ముఖం అవమానంతో క్రిందికి వాలింది!

అందరివైపూ తిరిగి మళ్ళీ ప్రారంభించాడు జలంధర్.

"మొదట్లో నాకు మదన్‌మోహన్‌పై అనుమానం రాలేదు. అతను అశోక్ రూమ్‌మేట్.

కాత్యాయని, తను ప్రేమించుకుంటున్నామని మదన్ మోహన్‌కి అశోకే చెప్పాడు. ఆ తర్వాత యశోధర అనే అమ్మాయిని తను ప్రేమిస్తూన్నట్టు మోహన్ చెప్పాడు. అయితే వీళ్ళిద్దర్ని గురించి అతను ప్రశ్నించలేదు. తమ ప్రేమవిషయాలు మాత్రమే చెప్పేవాడు.

"మోహన్‌కి తెలుసు తనడక్కుండానే అశోక్ అన్ని విషయాలూ చెబుతాడని! ఏదైనా విషయాన్ని ఎదుటి వారు చెబుతూన్నప్పుడు అదే విషయం గురించిన మన

అనుభవాలు మనమూ చెబుతాం వాళ్ళడగనవసరం లేకుండానే. అది బాగా తెలుసు మదన్ మోహన్ కి. అందుకే పట్టనట్టు వుండిపోయాడు.

"కాత్యాయని, అశోక్ లు ప్రేమించుకున్నారు. వారిద్దరికీ శారీరక సంబంధం వుంది. మోహన్ కూడ యశోధరని ప్రేమిస్తున్నాడు. కాని వారిద్దరి మధ్య అలాంటి సంబంధానికి యశోధర యిష్టపడలేదు.

"క్లోజ్ ఫ్రెండు కాబట్టి మోహన్తో ఒక్కటీ దాచకుండా చెప్పేవాడు అశోక్. దాంతో మోహన్ కి పిచ్చెక్కినట్టయ్యేది. రాత్రుల్లో తను కూడ కాత్యాయన్ని తన ప్రక్కన వూహించుకొని కలలుగంటూ దేవాడు. ఆ పిచ్చి నెమ్మదిగా 'కాత్యాయన్ని అనుభవించాలి' అని తీర్మానించుకునేదాకా తెచ్చిపెట్టింది.

"స్నేహితుడు ప్రేమిస్తోన్న అమ్మాయి కదా అనే విచక్షణాజ్ఞానం అతనిలో నశించింది. 'మదన్' పేరుతో ఆమెకి రెండుసార్లు ఉత్తరాలు రాశాడు. బదులు రాలేదు. కాత్యాయనికి తను అశోక్ ఫ్రెండని తెలీదుగాబట్టి బయటపడదనుకొని ధైర్యంగా రెండుసార్లు కలిసి నిర్భయంగా తన కోర్కె వెల్లడించాడు. ఆమె తీవ్రంగా తిరస్కరించింది. పిచ్చివాడైపోయాడు. ఐదోసారి ఆఖరుసారిగా ఉత్తరం రాశాడు. అప్పటికీ ఆమె లొంగలేదు

"మోహన్ వద్ద కొన్ని సైంటిఫిక్ టాబ్లెట్లున్నాయ్. అవి మ్రింగితే మనిషి మాయమైపోతాడు. ఎలా మాయమవుతాడో తర్వాత మోహనే వివరిస్తాడు.

"ఐదోసారి కూడ కాత్యాయని పలక్కపొయ్యేసరికి మోహన్ కోపం తారస్థాయినందుకుంది. సమయంకోసం

కాచుకున్నాడు. ఇంతలో శోధ ఎంటర్‌ప్రైజెస్‌లో ఉద్యోగమిస్తానని, అశోక్‌ని రమ్మని రూప ఎంటర్ ప్రైజెస్ మేనేజర్ చెప్పాడు.

"ఆ రాత్రి తొమ్మిదిన్నరకి తను మేనేజర్ని ఇంట్లో కలవాలి. అనుకోకుండా ఆ ఉదయం పది గంటలకి కాత్యాయని అశోక్‌ని కలిసి సాయంత్రం అయిదింటికి హోటల్ ఫుల్ మూన్‌కి రమ్మంది. ఆమె మాట కాదనలేక వెళ్ళాడు అశోక్. తొమ్మిది గంటలవరకూ వాళ్ళు హోటల్లోనే గడిపారు. ఆ తర్వాత హోటల్ కనిపించేవరకూ కలిసి వెళ్ళి చెరో కోకాకోలా తాగేసి ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళటం అలవాటు ఇద్దరికీ. కాని ఆ రోజు మేనేజర్ రమ్మన్నాడుగా! అందుకని అట్నుంచి అటే వెళ్ళి పోయాడు అశోక్.

"అవకాశంకోసం ఎదురుచూస్తోన్న మోహన్‌కి చక్కటి అదను లభించింది. మోహన్ కారు వెనక సీట్లో ప్రవేశించాడు. కాత్యాయని అతన్ని చూడలేదు. మామూలుగా కారు స్టార్టు చేసింది. జనంలేని స్థలం చూసుకొని టాబ్లెట్ మింగి దెయ్యం అయ్యాడు. కాత్యాయని దృష్టి తనపై పడేలా చేశాడు.

"ఆ భయంకరాకారాన్ని చూడగానే ఆమె గుండె ఆగి మరణించింది. ఆ తర్వాత తనే డ్రైవ్ చేస్తూ ఆమెని-అంటే ఆమె శవాన్ని ఇంటివద్ద దిగబెట్టి వెళ్ళిపోయాడు వ్రేలిముద్రలు పడకుండా జాగ్రత్తలు తీసుకొని!

"మిస్టర్ మోహన్! నీ కోరిక తీర్చలేదనే కోపంతో కాత్యాయన్ని హత్య చేశావ్ తెలివిగా. కాని అమాయకులైన నాకర్లు నీకేం ద్రోహం చేశారు? వాళ్ళనెందుకు

చంపావ్? జగదీష్‌బాబునెందుకు చంపాలని చూశావ్?''
గంభీరంగా చూశాడు జలంధర్.

''పగ! ద్వేషం!! అసహ్యం!!!''

మోహన్ కంఠంలోని ఆ క్రౌర్యానికి అక్కడున్న అందరితోపాటు జలంధర్ కూడ చకితుడయ్యాడు!!!

''పగనా?''

''అవును. పగ! ఈ క్షణంలో నా చేతులు నా ఆధీనంలో లేవు. ఉండివుంటే ఇప్పుడే జగదీష్‌బాబుని చంపివుండేవాణ్ణి!!!''

''కారణం?''

''కారణం లేందే ఇంత సాహసం ఎవడూ చెయ్యడు జలంధర్ గారూ! వినండి.''

చెప్పటం ప్రారంభించాడు మదన్ మోహన్.

''అప్పుడు నేను చిన్నవాణ్ణి. మా అక్కయ్యకింకా పెళ్ళి కాలేదు.

ఓ రోజు...

మావాళ్లంతా ఎక్కడికో వెళ్లారు. నాకు సరిగా గుర్తులేదు. మా అక్కయ్య, నేను మాత్రమే వున్నాం. ఉన్నట్టుండి ఇతను, మరొకడితో లోనికొచ్చి మా అక్కయ్యతో ఏదో మాట్లాడి చెయ్యి పట్టుకున్నాడు.

మా అక్కయ్య పెనుగులాడింది. ఆఖరుకి నన్ను కేకేసింది. నాకు కోపం ఆగలేదు. మా అక్కయ్యని వీళ్ళు ఏడిపిస్తున్నారు! అంతే అప్పట్లో నాకు తెలిసింది.

పిచ్చికోపంలో అక్కడే వున్న రోకలితో ఇతనితో వున్నవాడి తలపై మోదాను. గట్టిగా అరచి క్రింద పడి

పోయాడు. రక్తం మడుగులు కట్టింది. ఇతను భయంతో పారిపోయాడు.

'ఎంత పని చేశావు తమ్ముడూ!' అని నన్ను పట్టుకొని ఏడ్చింది మా అక్కయ్య. నాకేమీ బోధపడలేదు.

ఆ తర్వాత పోలీసులొచ్చారు. నన్ను పట్టుకుపోయారు. కోర్టులో ఏవేవో అడిగారు. మాటలు జరిగాయ్. ఆ తర్వాత నన్ను వేరే వూళ్ళో ప్రత్యేకమైన స్కూలుకి పంపించారు.

అక్కడే పెద్దవాణ్ణయ్యాను. ఆ తర్వాత నన్ను వదిలి పెట్టారు. మళ్ళీ ఇంటికెళ్ళ బుద్ధికాలేదు నాకు. ఈ వూరొచ్చాను. కష్టపడితే రూప ఎంటర్‌ప్రైజెస్‌లో ఉద్యోగం వచ్చింది. కొన్నాళ్ళయ్యాక అనుకోకుండా యశోధర పరిచయమైంది.

ఆ తర్వాత కొన్నాళ్ళకి వాళ్ళ నాన్నకి పరిచయం చేసింది. ఆయనో పెద్ద సైంటిస్టు. ఆయనకి నాపై నమ్మకం కలిగింది. తనకి అసిస్టెంటుగా పని చెయ్యమని కోరారు. చేరాను. రాత్రులు ఆయనవద్ద, పగలు ఆఫీసులో కష్టపడి పనిచేసేవాణ్ణి.

ఆయనో పెద్ద పరిశోధనచేసి విజయం సాధించాడు. ఓ రకమైన మాత్రలు తయారుచేసి వాటికి 'నిక్‌నాల్ 201' అని పేరుపెట్టాడు. ఆ టాబ్లెట్ ఒక్కటి వేసుకుంటే చాలు. గంటసేపటివరకూ అతడు మాయమై పోతాడు. ఎదుటి మనిషికి కన్పించడు. రెండు మాత్రలు వేసుకుంటే రెండు గంటలపాటు ఎవరికీ కన్పించడన్న మాట. రెండు గంటలు దాటిన మరుక్షణం మామూలుగా మారిపోయి మళ్ళీ అందరికీ కన్పిస్తాడు.

ఈ ప్రయోగాన్ని అతడు నాకు స్వయంగా చూపిం

చాడు వన్ ఫోర్త్ టాబ్లెట్ తను వేసుకొని! పావుగంట సేపు ఆయన ధరించిన దుస్తుల్ని తప్ప ఆయన శరీరాన్ని చూడలేకపోయాను.

పాపం! వాటిని ప్రభుత్వానికి అప్పగించకముందే ఆయన ఆయుర్దాయం తీరి మరణించాడు!

ఇదిలా వుండగా ఓ రోజు ఈ జగదీష్‌ను బజారులో చూశాను.

నా తల తిరిగిపోయింది. చిన్నప్పటి సంఘటన తెరలు తెరలుగా మెదడులో తిరిగింది. ఈ జగదీష్ మా అక్కయ్యని బలవంతం చేశాడు. ఆ కారణంగానే నేను జైలు పాలయ్యాను. అతడిమీద నాకు ప్రతీకారం ప్రజ్వరిల్లింది. అతనిని వెంటాడి అతడి ఇల్లు తెలుసుకున్నాను.

నా హృదయం కుతకుత ఉడకసాగింది! జగదీష్‌బాబుని హత్య చెయ్యాలి! నా మనసునిండా అదే ఆలోచన!

ఆ తర్వాత రూమ్‌మేట్ అశోక్ ప్రేమిస్తున్న కాత్యాయని కూడా జగదీష్‌బాబు కూతురేనని తెల్సింది. దానితో నా అక్కయ్యకు జరిగిన అన్యాయమే అతడి కూతురుమీద తీర్చుకోవాలనిపించింది.

ముందుగా కాత్యాయన్ని అనుభవించి చంపి ఆ తర్వాత జగదీష్‌ని చంపాలనే నిర్ణయానికొచ్చాను. పథకం ఆలోచించాను.

కాత్యాయనికి 'మదన్' పేరుతో ఉత్తరం రాశాను. జవాబు లేదు. రెండోదానికీ ఫలితం లేకపోయింది. రెండుసార్లు నేనే కలిశాను. కోరిక తీర్చమని చెప్పాను. విదిలించిపారేసింది. ఐదోసారీ రాసి చూశాను. ప్రయోజనం శూన్యమే అయింది.

ఆమె ననుభవించి చంపి, జగదీష్‌కి తెలిపి బాధపెట్టి ఆ తర్వాత అతడినీ చంపాలనుకున్న నా ఐడియా ఫలించ లేదు.

ఆలోచించి మరో పథకాన్ని అనుసరించాను.

ఓ భయంకరమైన తల, కుడిచెయ్యి, వెడల్పయిన పాదాలని టోపన్స్‌లా తయారుచేయించాను. మాత్ర వేసుకొని వాటిని ధరిస్తేచాలు. ఎదుటి వ్యక్తికి భయంకర మైన పెద్ద తల, లావుపాటి కళ్ళు, పొడుగాటి ముక్కు, కుడిచెయ్యి, పాదాలు మాత్రమే కన్పించేవి. పాదాల టోపన్స్‌కి కాలివ్రేళ్ళు వెనక్కి వచ్చేటట్టు బూట్లు తయారుచేయించి వాటికి ఈ పారలు అంటించి తొడు క్కున్నాను. వాటినిండా గుబురుగా వెంట్రుకలుంటాయ్.

ఎటువంటి గుండెనిబ్బరం గలవాడైనా, శరీరం కని పించని అటువంటి భయంకరాకారం దగ్గరగా కనిపిస్తే టక్కున గుండె ఆగి చస్తాడు.

ఈ విధంగా హోటల్ వద్ద కాత్యాయని కారులో ప్రవేశించి దెయ్యంగా మారి ఆమెని బెదిరించాను. నా ఆకారాన్ని చూడగానే ఆమె భయపడి ప్రాణాలు వదిలింది. ఓ సమస్య తీరింది.

ఇక మిగిలింది జగదీష్‌బాబు. అతన్ని చంపాలి. అత నింట్లో ఒకరు కాదు - ఇద్దరు కాదు — నలుగురు నౌకర్లు న్నారు, అయినా భయపడలేదు.

వెళ్ళాను. లాఘవంగా తలుపులు తెరిచి వాళ్ళింట్లో ప్రవేశించాను. వెళుతూండగా ఓ గదిలోంచి మాటలు ఏవో విన్పిస్తున్నాయ్. గబగబా దెయ్యంలా తయారై తలుపులు తోశాను. ఎదురుగా ఓ ఆడది, మగాడు సరసా

లాడుతూ కన్పించారు. నన్ను చూడగానే వాళ్ళు గుండెపగిలి చచ్చారు. త్వరలో జగదీష్‌బాబు కూడ ఇలాగే చస్తాడని వూహిస్తూ చిన్నగా నవ్వుకుని అతని కోసం వెదికాను. కాని జగదీష్‌బాబు అదృష్టం బావుంది. ఇంట్లో లేడో, వూళ్లో లేడో కన్పించలేదు. అప్పటికి వెళ్ళిపోయాను.

ఆ తర్వాత మళ్ళీ ఓ సారి వెళ్లాను. మెట్లెక్కుతూండగా మిగిలిన ఇద్దరు నౌకర్లూ అటువేపొచ్చారు. నన్ను చూసి వాళ్ళకూ హార్టు ఫెయిలయ్యింది. ఒకడు అరచి క్రింద పడ్డాడు. ఒకడలాగే కుప్పలా కూలిపోయాడు. అనుమానం రాకుండా ఇద్దర్నీ మెట్లపైకి చేర్చి పైకి వెళ్ళాను. ఆ రోజు కూడా జగదీష్‌బాబు ఎక్కడా కనిపించలేదు.

మరునాడు మళ్ళీ జగదీష్‌బాబు ఇంటికి వెళ్ళాను.

ఇంటిముందు యిద్దరు కాపలా వున్నారు. వాళ్ళు పోలీసులని గ్రహించాను. ఏదైనా అలికిడైతే పిస్తోలుతో కాలిస్తే ప్రమాదమని వెనకవేపుగా వెళ్ళాను. కాని దురదృష్టవశాత్తు జగదీష్‌బాబు కిటికీలోంచి నా ఆకారాన్ని చూసి గట్టిగా కేకేశాడు. పోలీసులు విని కాలుస్తారేమోనని భయపడి పారిపోయాను.

జగదీష్‌బాబు చనిపోయుంటాడని వూహించాను. కాని అతడు దూరంనుండి చూశాడు. ప్రాణం పోలేదు.

ఇంత చేసినా జగదీష్‌బాబుని చంపలేకపోయాను. పైగా ఎన్నో ఐడియాలతో పథకాన్ని ఎంతో పటిష్ఠంగా తయారుచేసుకొని యింతవరకూ దొరకని నేను ఏ పొరపాటువల్ల దొరికిపోయానో నాకు అర్థంకావటంలేదు.''

నిట్టూర్చాడు మోహన్.

జగదీష్‌బాబు అవమానంతో తల వంచుకున్నాడు.

"అందుకే అన్నారు మిస్టర్ మోహన్! తెలివి ఒక్కడి సొంతం కాదని! నీ మేధస్సుని అభినందిస్తున్నాను. కాని మహా మేధావులు సైతం ఒక్కోసారి పప్పులో కాలేస్తుంటారని ఋజువుపరచావ్.

దెయ్యంలా నమ్మించాలని నువ్వు చేసిన ప్రయత్నాలు, అందుకు నువ్వాలోచించిన ఐడియాలు నిజంగా అభినందించ దగ్గవి. మొదట్లో నీమీద నాకు అనుమానం లేదు. అశోక్‌ను అనుమానించాను. అందుకే ఈ రోజు ఉదయం మీరు ఆఫీసుకు వెళ్ళగానే మీ రూమ్‌లోకి ప్రవేశించి వెదికాను. అశోక్ పెట్టె అనుకొని నీ పెట్టె తాళం తీసి గబగబా వెదికాను. కాత్యాయని నీకు రీడైరెక్ట్ చేసిన మొదటి రెండు ఉత్తరాలు, నీ డైరీ కన్పించాయ్. ఇంకా వెది కాను డైరీ జేబులో వేసుకొని. 'నిక్ నాల్ 201' టాబ్లెట్స్ కొన్ని కన్పించాయ్. వాటి ప్రక్కనే అవి తయారుచేసే ఫార్ములా కూడ నా కంటబడింది. నీ ప్లాన్ అంతా అర్థమై పోయింది. వెంటనే బయటకొచ్చి, ఇన్‌స్పెక్టర్‌కు చెప్పి యీ సమావేశం ఏర్పాటుచేశాను,

చూశావా! చివరికి నీవింతవరకూ ఉపయోగించిన నిక్ నాల్ 201 టాబ్లెట్సే నిన్ను పట్టిచ్చాయ్." అంటూ ముగించాడు డిటెక్టివ్ జలంధర్.

అయన మేధాసంపత్తికి అక్కడున్నవారందరూ ఆశ్చర్యపోయారు!!!

—: ఐపోయింది :—